క్లుప్తంగా

కాటన్ జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



గుంటూరు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాటన్ జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగి, పత్తి బేళ్లు దగ్ధమయిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు సమీపంలోని కొమ్మాలపాటి కోటేశ్వరరావు కాటన్ జిన్నింగ్ మిల్లును నిర్వహిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో మంగళవారం మిల్లులో అకస్మాత్తుగా పొగలు వచ్చి మంటలు రేగటంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మంటలను ఆర్పివేశారు. మంటలకు జిన్నింగ్ పత్తి బేళ్లు కొంతమేర దగ్ధమయ్యాయని ఆస్తినష్టం అంచనా వేస్తామని పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: పెదకాకాని మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల ఏఈ బత్తుల శ్రీనివాసరావు అన్నారు. రాబోయే వేసవికాలం, విద్యార్థుల పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు బుడంపాడు సబ్‌స్టేషన్‌లో ముందస్తు విద్యుత్ మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ మరమ్మతుల కారణంగా పెదకాకాని, వెనిగండ్ల, ఎన్టీఆర్ కాలనీ, వెంగళరావునగర్, కాశీ గార్డెన్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ బి శ్రీనివాసరావు కోరారు.

చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో...

చేబ్రోలు: చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వెంకట సుధీర్ మంగళవారం తెలిపారు. రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా కోసం బుడంపాడు వద్ద 132 కేవీ సబ్ స్టేషన్ వద్ద మరమ్మతులు చేపట్టనున్నారు. దీని నిమిత్తం చేబ్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని చేబ్రోలు, నారాకోడూరు, మంచాల, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, గుండవరం, గొడవర్రు గ్రామాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ వెంకట సుధీర్ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం



పెదనందిపాడు: విద్యుత్ షార్ట్ షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధమైన ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదనందిపాడు యాదవ బజార్‌లో ఒంటిపులి అంకమ్మ, ఆమె కుమారుడు నివాసం ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో షెడ్డు మొత్తం కాలి బూడిదయ్యింది. ఈ ప్రమాదం లో 15 సవర్ల బంగారం, రూ.60 వేలు నగదు, ఇంట్లో ఉన్న సామాను అంత కాలి పోయినట్లు తెలిపారు. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ పరిశీలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొత్తూరు సమీపంలో ఎన్‌హెచ్ 16 హైవే పక్కన కాల్వలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం సంఘటన స్థలికి చేరుకున్న సౌత్‌జోన్ డీఎస్పీ జెస్సీప్రశాంతి, సీఐ శ్రీనివాసరావులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలకు పైబడిన వ్యక్తిగా గుర్తించారు. సుమారు రెండు మూడు నెలల క్రితం చనిపోయినట్లుగా శరీరం అంతా డీకంపోజ్ అవ్వటంతో అస్థిపంజరంలా తయారైంది. దీంతో మృతదేహంపై ఉన్న ఆధారాల ప్రకారం వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడా? లేక ప్రమాదం జరిగిందా? లేక ఇంకా ఏదైనా కారణాలున్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంపై ఉన్న బనియన్ బట్టిచూస్తే కూలీలు ధరించే కలర్ బనియన్ ఉండటంతో కార్మికుడై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రెయిన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- వడ్లమూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



వడ్లమూడి గరువుపాలెంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెం, గౌడపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని వివరించటంతో పాటు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల్ని పూర్తి స్థాయిలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలకు మంజూరైన నిధులతో పాటు ప్రత్యేక నిదులతో గ్రామాభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానికంగా తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా 823 గృహాల్ని పర్యటించి వారికి ప్రభుత్వ లబ్ధిని తెలియజేశారు. వడ్లమూడిలోని అన్నపూర్ణమ్మకాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. కాలనీలో ఎక్కువ మంది డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కిలారి ఆర్‌డబ్ల్యూఎస్, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శిలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి పలు సూచనలు చేశారు. సైడ్ కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించటం, అందరికి అనుకూలంగా ఉండే విధంగా ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీలోకి కాలువలను అనుసంధానం చేయాలని సూచించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను స్థానికుల సహకారంతో సైడ్ కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గరువుపాలెంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ వడ్లమూడి గ్రామ సచివాలయం-2 పరిధిలో రూ.12,55 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు షేక్ అహ్మద్, వై.శివరామకృష్ణ, పెదమస్తాన్, జానీ, ఎ.శివాజీ, రమేష్, గోపి, కె.మాణిక్యం, టి.మస్తాన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎరువులు విక్రయించాలి

పొన్నూరు ఏడీఏ తిరుమల దేవి



ఎరువుల దుకాణంలో స్టాకు రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న ఏడీఏ తిరుమల దేవి

కాకుమాను: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజనల్‌లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులకు ఈ-క్రాప్ డేటా ఆదారంగా ఎరువులు(యూరియా)విక్రయించాలని పొన్నూరు ఏడీఏ తిరుమల దేవి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం మండలంలోని పలువురు రైతులకు అధిక మొత్తంలో(ఒక్కో రైతుకి 50 బస్తాలు)విక్రయించినట్లు ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణ యజమానులు, రైతుల వివరణ కోసం వచ్చినట్లు ఆమె తెలిపారు. రానున్న రోజుల్లో ఎరువుల దుకాణాలలో రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఈ-క్రాప్ డేటా ఆదారంగా ఎరువులు విక్రయించాలని ఆమె ఆదేశించారు. డేటా ఆధారంగా రైతు ఎన్ని ఎకరాల్లో ఏయే సాగు చేస్తున్నాడు, ఎరువు ఎంత అవసరమో గుర్తించి విక్రయించాలని ఆమె సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ కె.కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

అగస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న అగస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కార్యదర్శి సాయి విశ్వనాథ్, ఆలయ అర్చకుడు పవన్‌కుమార్‌శర్మల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంల్లో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తలంబ్రాల సేవ నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారికి వార్లు పోసి స్వాగతం పలికారు. మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విజ్ఞాన్ నిరులలో డాక్టర్ నీరజను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక తదితరులు

విజ్ఞాన్ నిరులలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గుంటూరు రూరల్: విద్యార్థినులు ఉన్నతంగా జీవించేందుకు చక్కగా చదువుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించినట్టయితే ఉన్నత స్థానాలను సులువుగా అందుకోగలుగుతారని న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ కె.నీరజ తెలిపారు. మంగళవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించటం వల్ల కుటుంబానికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో...



ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.రమాసుందరి

గుంటూరు రూరల్: దేశ ఆర్థిక పురోగతి సాధనలో, కీర్తి ప్రతిష్టలను ఇనుమడించటంలో మహిళల కృషి ఎనలేనిదని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. బాపట్ల ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ కె.రమాసుందరి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర, వారి ఆవశ్యకత ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ జి.సుధావాణి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి యాగం

పాతగుంటూరు: ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ప్రాతఃకాల ఆరాధన, నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సాయంకాలం ఆరాధన, ఎదుర్కోలు ఉత్సవం, రాయబారోత్సవం, అనంతరం విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ, కార్యదర్శులు దాసరి భాస్కర రావు, పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, సభ్యులు పర్యవేక్షించారు.

తూకంలో తేడాలపై కేసులు నమోదు

నెహ్రూ నగర్: తూకంలో తేడాలు వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పేర్కొన్నారు. డిప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు ఆదేశాల మేరకు పీవీకే నాయుడు మార్కెట్, నగర పాలకసంస్థ కార్యాలయం ముందు ఉన్న ద్రాక్ష పండ్లు అమ్మే దుకాణాల్లో మంగళవారం రాత్రి తనిఖీ నిర్వహించారు. తూకంలో తేడాలు ఉన్న నాలుగు ద్రాక్ష దుకాణాలపై నాలుగు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. పీవీకే నాయుడు మార్కెట్‌లో స్టాంపింగ్ లేని ఆరు కాటాల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

పౌష్టికాహారం పరిశీలన

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం తీసుకొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలని బాలల హక్కుల కమిటీ మెంబర్ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం సంజీవయ్య నగర్ లోని అంగన్ వాడీసెంటర్‌లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. సెంటర్లో అందుతున్న పౌష్టికాహారం అర్హులైన లబ్దిదారులకు సక్రమంగా అందుతున్నది లేనిదీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు

గుంటూరు మెడికల్: వరల్డ్ ఉమెన్స్ డే సందర్భంగా స్థానిక గుంటూరువారితోటలోని విక్టోరియా కాలేజీలో సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ ఎలైట్ హాస్పిటల్స్ జనరల్ సర్జన్ డాక్టర్ దీప్తి ప్రవళిక మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ బి.అప్పారావు, కరెస్పాండంట్ ఇన్నయ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎదురుపాక వెంకట్, ప్రాజెక్ట్ లీడర్ డాక్టర్ దీవెన, డాక్టర్ సంకీర్తన, విక్టోరియా కాలేజీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి అందరూ కృషి చేయాలి



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎంఈఓ కెనడీ, ఉపాధ్యాయులు

కొండపాటూరు(కాకుమాను): మహిళాభివృద్ధికి సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయినులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల ఉన్న వివక్షతను వదిలి ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఆటల పోటీలలో గెలుపొందిన, పాల్గొన్న అందరికీ బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయినులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం శీలం అంకారావు,పీ ఎంసీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీతో లలితా హాస్పటల్ అవగాహన



ఒప్పంద పత్రాలను చూపుతున్న వీసీ పి.నాగభూషణ్, లలితా సూపర్ స్పెషాలిటీ బృందం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీతో గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వీసీ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ న్యూరో సర్జన్ ఎస్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను అందించారు. వీసీ నాగభూషణ్ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టబోతున్న నూతన పారా మెడికల్ కోర్సులకు కావాల్సిన టెక్నాలజీలను అభివృద్ధి చేస్తామన్నారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు.

టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలోకి మంగళవారం రాత్రి చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో జరిగిన కార్యక్రమంలో బుడగ జంగాలుకు చెందిన నాయకుడు పస్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 25 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయనున్నట్లు స్థానికులు ప్రకటించారు. గ్రామ సర్పంచి ఎం.అనితారాణి, ఎంపీపీ కె.సాహితి, డీసీఎంఎస్ డైరక్టర్ పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పెద మస్తాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టోత్తర శత కలశ స్నపన

పాతగుంటూరు: నందివెలుగు రోడ్డు వసంనగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచల స్వామి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం అగ్నిహోత్రం రంగాచార్యులు నిర్వహణలో 12 ప్రధాన ద్రవ్యాలతో అష్టోత్తర శత కలశ స్నపన అభిషేకం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్

పాతగుంటూరు,లక్ష్మీపురం: ముస్లింలకు పవిత్రమైన షబ్ ఏ బరాత్ పండుగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. రాత్రి మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. రాత్రంతా జాగారం చేసి అల్లాహ్‌ను ఆరాధించారు. ముస్లిం శ్మశాన వాటికల్లో తమ పూర్వీకుల సమాధులను సందర్శించి వారిని స్మరించుకున్నారు. సమాధుల వద్ద సామూహికంగా ప్రార్థనలు చేశారు. మహిళలు ఇళ్లలో ప్రార్థనలు చేశారు.

ప్రారంభమైన 97వ సనాతన వేదాంత జ్ఞానసభలు

సభలకు తరలివచ్చిన పీఠాధిపతులు, స్వామీజీలు



ప్రసంగిస్తున్న వ్యాసాశ్రమ పీఠాధిపతులు శ్రీపరిపూర్ణానంద గిరి స్వాములు

పెదకాకాని: దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రం ఆధ్వర్యంలో 97వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పెదకాకాని మండలం, నంబూరు ఐజేఎం వద్ద నిర్మించిన దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైన సభలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన పీఠాధిపతులు, స్వామీజీలు అందరూ ఒకచోట చేరి సనాతన ధర్మాన్ని బోధించారు. మూడు రోజుల పాటు జరిగే సభలో తొలి రోజు ప్రారంభ ఉపన్యాసాన్ని చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు శ్రీ పరిపూర్ణానంద గిరి స్వాములు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమవుతుందన్నారు. వేదాలు, ఉపనిషత్తులు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సనాతన ధర్మమే ప్రతి ఒక్కరినీ కాపాడుతుందని తెలిపారు. మన ధర్మాన్ని మనం కాపాడుకోవాలని సూచించారు. ప్రతి మనిషిలోనూ దైవభక్తి పెరగాలని, అసత్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. దత్త విజయానంద తీర్థ స్వామిజీ, దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు, పలువురు స్వామీజీలు, పీఠాధిపతులు, భక్తులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీఅగ్రహారం 11/2లో విద్యాసాగర్ (27) నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసై మానసికంగా కుంగిపోయాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యాసాగర్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమయ్యనగర్‌కు చెందిన 29 సంవత్సరాల ఎస్.హరికృష్ణ మంగళవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం వెతికినా కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

26 పీపాల సాల్వెంట్ ఆయిల్ స్వాధీనం

గోడౌన్ నిర్వాహకుడిపై 6 ఏ కేసు నమోదు



గోడౌన్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి, ఏసీఎస్ఓ లక్ష్మీనారాయణరెడ్డి

పెదకాకాని: గుంటూరు ఆటోనగర్ లోని శ్రీ గోమాత ఆయిల్ ట్రేడర్ పేరుతో కల్తీ ఆయిల్స్ కలిపి ఇండస్ట్రియల్ సాల్వెంట్ ఆయిల్(వైట్ ఆయిల్)ను తయారు చేస్తున్న గోడౌన్‌పై విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు చేశారు. ఎటువంటి లైసెన్స్ లేకపోవడం, అక్రమ వ్యాపారం చేయడంతో 26 పీపాలు సాల్వెంట్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై 6ఏ కేసు నమోదు చేశారు. పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ఆటోనగర్ శ్రీ గోమాత ఆయిల్ ట్రేడర్ పేరుతో ఇండస్ట్రియల్ సాల్వెంట్ ఆయిల్ గోడౌన్‌లో నకిలీ ఆయిల్ తయారు చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు ఉన్నాతాధికారులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు, విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయీస్ అధికారులతో కలసి షాపు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో షాపు యజమాని తిరుమలశెట్టి రమేష్ బాబు ఏ విధమైన లైసెన్స్ లేకుండా సాల్వెంట్ ఆయిల్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో ఆఆయిల్ ను లారీ డ్రైవర్లకు ఫ్యూయల్ టాంక్‌లలో కలిపి పోస్తున్నట్లు, ఆటో మొబైల్ షాపుల వారికి ఏ విధమైన లైసెన్స్, రికార్డ్స్ లేకుండా అమ్ముతున్నట్లు కనుగొన్నారు. షాపులోని 26 పీపాల సాల్వెంట్ ఆయిల్, పరికరాలతో సహా స్వాధీన పరచుకున్నారు. షాపు యజమాని తిరుమలశెట్టి రమేష్ బాబుపై పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ సివిల్ సప్లయీస్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో ఎస్ఎస్ఏ అధికారుల విచారణ



గ్రామ సచివాలయం వద్ద విచారణ చేస్తున్న సర్వశిక్ష అభియాన్ అధికారులు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో నాడు-నేడు పాఠశాల అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఏపీసీ సర్వశిక్ష అభియాన్ అధికారులు విజయలక్ష్మి, ఏఎంఓ జాలాది రవిలు గ్రామంలో విచారణ చేశారు. నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన పాఠశాలను, అక్కడ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాల వద్ద ఇనుము, తదితర వస్తువులు అపహరణలకు గురయ్యాయన్న ఫిర్యాదు మేరకు గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మబ్బు శిరీష, మబ్బు సుధాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెన్షనర్లకు పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనవరిలో రావాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలను చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ ఎన్.మోహనరావుకు టీచర్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శౌరిరాయలు, ఎన్.శరత్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళగిరిలోని రాష్ట్ర ట్రెజరీ కార్యాలయంలో మంగళవారం మోహనరావును కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. మోహనరావును కలిసిన వారిలో సంఘ కోశాధికారి జె.రంగారావు ఉన్నారు.